A **ఆత్మీయ వరములు:**

❖ **అనేక వరములు — ఒకే దాత.**

— ఆత్మీయ వరములను ఎవరు అనుగ్రహించుచున్నారు? (1 కొరింథీయులకు 12:4-6)

| | | | | |
|---|---|---|---|---|
| **1 కొరింథీ 12:4** | | వరములు | | **ఆత్మ** |
| **1 కొరింథీ. 12:5** | **వరములు అనేకములు** | పరిచర్యలు | **ఒక్కటే** | ప్రభువు |
| **1 కొరింథీ. 12:6** | | **కార్యములు** | | **దేవుడు** |

— అపొస్తలుడైన పౌలు ఆత్మీయ వరములకును వాటిని అనుగ్రహించువానికిని మధ్యనున్న సంబంధమును వివరించుటకు మూడు పదములను ఉపయోగించెను. అవి వరములు, పరిచర్యలు, మరియు కార్యములు. ఇవి వరముల వైవిధ్యమును తెలియజేయుచున్నవి.

— అయితే వరములను అనుగ్రహించువాడు ఒక్క దేవుడే. పరిశుద్ధాత్మ, ప్రభువైన యేసుక్రీస్తు, మరియు పరలోక తండ్రియైన దేవుడు ఏకమనస్సుతో కార్యముచేయుచు విశ్వాసులకు వరములను అనుగ్రహించుచున్నారు (యోహాను 14:16).

— అయితే దేవుడు అన్యజనుల దేవతలవలె వరములను అనుగ్రహింపడు (1 కొరింథీయులకు 12:2). ఆయన యొద్ద పక్షపాతముగాని, స్థాయివిభేదముగాని లేదు. ఎవరు గొప్పవారో వారికే వరములు అనుగ్రహించడు; తన చిత్తానుసారముగా ప్రతి విశ్వాసికి తగిన వరమును ప్రసాదించుచున్నాడు.

— దేవుడు ఎందుకు భిన్నమైన వరములను భిన్నమైన వారికి అనుగ్రహించుచున్నాడు? (1 కొరింథీయులకు 12:7)

— ఆత్మీయ వరములు సంఘాభివృద్ధికిని, పరిశుద్ధుల ప్రయోజనమునకును అనుగ్రహింపబడినవి. సంఘ నిర్మాణార్థముగా ఏ వ్యక్తికి ఏ వరము అవసరమో దేవుడు మాత్రమే సంపూర్ణముగా ఎరిగియున్నాడు. అందుచేత ప్రతి విశ్వాసి తనకు అనుగ్రహింపబడిన వరమును సంఘ మేలుకొరకు వినియోగింపవలెను..

❖ **అనేక అవయవములు — ఒకే శరీరము.**

— దేవుడు ఒక్కడే అయినను, దైవత్వములోని ప్రతి వ్యక్తి తన ప్రత్యేక కార్యమును నిర్వహించుచున్నాడు. అదేవిధముగా సంఘము ఒక్కటే అయినను, క్రీస్తు శరీరములో ప్రతి సభ్యునికి ప్రత్యేక బాధ్యత కలదు (1 కొరింథీయులకు 12:12-13).

— పౌలు మానవ శరీరమును ఉదాహరణగా తీసుకొని సంఘ ఐక్యతను వివరించెను. కన్నుకు చూచు శక్తి కలదు; చెవికి విను శక్తి కలదు. రెండూ వేర్వేరు కార్యములు చేయుచున్నను ఒకదానికొకటి సహకరించుచున్నవి.అదేవిధముగా సంఘములో ప్రతి విశ్వాసి తనకు అనుగ్రహింపబడిన వరమును బట్టి సేవ చేయవలెను (1 కొరింథీయులకు 12:28-30).

— దీనివలన మనము గ్రహించవలసిన సత్యములు: ప్రతి సభ్యుడు అవసరమైనవాడే. ఎవ్వరును మరియొకరి కంటే గొప్పవాడు కాదు.

— ప్రతి ఒక్కరూ ఇతరుల మేలు కోరవలెను. సంఘ ఐక్యతను కాపాడుటకు అందరూ కలిసి పనిచేయవలెను (1 కొరింథీయులకు 12:15-27).

B **సంఘమును ఐక్యపరచు అంశము:**

❖ **ప్రేమయే శ్రేష్ఠమైన మార్గము.**

— ప్రేమ ఒక వరము కాదు; అది "అత్యుత్తమమైన మార్గము" (1 కొరింథీయులకు 12:31). ప్రేమ పరిశుద్ధాత్మ ఫలమై విశ్వాసి జీవితములో ప్రత్యక్షమగును (గలతీయులకు 5:22). ప్రేమ లేకుండ ఆత్మీయ వరములు సరిగా ఉపయోగింపబడవు..

— ప్రేమలేని భాషల వరము ఘోషించు ఇత్తడి, మ్రోగు తాళమువంటిది. ప్రేమలేని ప్రవచన వరము, జ్ఞాన వరము, విశ్వాస వరము వ్యర్థమైనవి. ప్రేమలేని దానధర్మములు, ప్రేమలేని ప్రాణత్యాగము కూడ దేవుని దృష్టిలో ప్రయోజనరహితమే (1 కొరింథీయులకు 13:1-3).

## C ప్రత్యేక వరములు:

### ❖ భాషల వరము.

— పౌలు భాషల వరమును గురించి ప్రత్యేకముగా బోధించుటకు కారణము, కొరింథు సంఘములో కొందరు దానిని దుర్వినియోగము చేయుచుండుటవలన ఆరాధనలో గందరగోళము ఏర్పడుటయే (1 కొరింథీయులకు 14:23)..

— భాషల వరమనగా, వ్యక్తికి తెలియని మానవ భాషలను గాని, దూతల భాషలను గాని మాట్లాడగల సామర్థ్యము (1 కొరింథీయులకు 13:1).

— ఆ భాష వినువారికి తెలియనప్పుడు దానికి భావార్థము చెప్పువాడు ఉండవలెను (అపొస్తలుల కార్యములు 2:8; 1 కొరింథీయులకు 14:2, 13-14, 27-28).

— పౌలు "అందరును భాషలతో మాట్లాడవలెనని" కోరిన మాటను కొందరు తప్పుగా అర్థము చేసికొనిరి. అతని ఉద్దేశ్యము ప్రతి విశ్వాసి తనకు దేవుడు అనుగ్రహించిన వరమును పొందవలెననే గాని, అందరూ ఒకే వరమును పొందవలెనని కాదు (1 కొరింథీయులకు 12:7; 14:1,5).

### ❖ ప్రవచన వరము.

— ప్రవచన వరమనగా భవిష్యత్తు సంగతులను మాత్రమే తెలియజేయుట కాదు. దాని ముఖ్య ఉద్దేశ్యము: సంఘాభివృద్ధి, ప్రోత్సాహము, ఆదరణ మరియు ఓదార్పు (1 కొరింథీయులకు 14:3).

— అందుచేత పౌలు ఈ వరమును విశేషముగా ప్రాముఖ్యతనిచ్చెను (1 కొరింథీయులకు 14:1, 4, 22-25). అయినను ఆయన హెచ్చరించెను: "సమస్తమును యోగ్యముగాను క్రమముగాను జరుగవలెను." (1 కొరింథీయులకు 14:40).

— ప్రకటన గ్రంథములో పేర్కొనబడిన శేష సంఘమునకు ప్రవచన వరము ఒక ప్రత్యేక గుర్తింపుగా అనుగ్రహింపబడెను (ప్రకటన 12:17; 19:10). ఈ వరము ప్రత్యేకముగా ఎలెన్ జి. వైట్ వారి జీవితం మరియు పరిచర్యలో ప్రత్యక్షమాయెను..

— **నిజమైన ప్రవక్తను ఎట్లు గుర్తించవచ్చు?**

(1) షరతులు లేని ప్రవచనములు తప్పక నెరవేరవలెను. (ద్వితీయోపదేశకాండము 18:22; యిర్మీయా 28:8-9; యోనా 4:2)

(2) అతని బోధ పూర్వ ప్రవక్తల వాక్యములకు అనుగుణముగా ఉండవలెను. (ద్వితీయోపదేశకాండము 13:1-3; యెషయా 8:20)

(3) యేసుక్రీస్తు శరీరధారియై వచ్చెనని అతడు సాక్ష్యమియ్యవలెను. (1 యోహాను 4:1-3)

(4) అతని జీవితం తాను ప్రకటించు దేవుని వాక్యమునకు అనుగుణముగా ఉండవలెను. (మత్తయి 7:15-20)